క్లుప్తంగా

నేటి నుంచి యోగా శిక్షణ

చైతన్యపురి: ఋషి ప్రభాకర్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ భవానీనగర్ మహిళా మండలి భవనంలో ఆదివారం నుంచి సిద్ధి సమాధి యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగా గురువు సద్గుణాచారి తెలిపారు. దీర్ఘకాలంగా పీడించే ఆస్తమా, డయాబెటిక్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, ఊబకాయం నుంచి విముక్తి కలిగించే సాధనం సిద్ధి సమాధి యోగా అని అన్నారు. శిక్షణ తరగతుల్లో ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, మెడిటేషన్, ఆహారపు అలవాట్లను నేర్పుతామన్నారు. మరిన్ని వివరాలకు నం. 93933 57033 ను సంప్రదించవచ్చన్నారు.

శ్రీసాయినగర్‌లోని సమస్యలు పరిష్కరించండి

నాగోలు: డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు గవ్వ శ్యామ్ సుందర్‌రెడ్డి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. రోడ్డు నంబర్ 3లో యూజీడీ లైన్లు చిన్నవిగా ఉండటం వల్ల తరచూ డ్రైనేజీ పొంగి కాలనీలోని రోడ్లు దుర్గంధ భరితంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యేను కలిసి సాయినగర్‌లోని డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు కాలనీలోని పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

రామాలయంలో ఈటల పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈటల, కార్పొరేటర్ తదితరులు

చైతన్యపురి: మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శనివారం చైతన్యపురి డివిజన్‌లోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

సత్వర న్యాయం అందించాలి



మాధవరెడ్డిని సత్కరిస్తున్న శివారెడ్డి తదితరులు

హస్తినాపురం: నిరుపేదలకు సత్వర న్యాయం అందించేందుకు రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి అన్నారు. రంగారెడ్డిజిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన పట్లోళ్ల మాధవరెడ్డిని శివారెడ్డి శనివారం కలిసి శాలువాతో సత్కరించారు. బొల్లంపల్లి రాజేశ్, వినోద్‌కుమార్, శివారెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

కన్నవారి చెంతకు సదనం బాలలు

సైదాబాద్: తప్పిపోయి తల్లిదండ్రులకు దూరమైన ఆ చిన్నారులు ప్రభుత్వ బాలల సదనంలో ఆశ్రయం పొందుతున్నారు... అధికారుల కృషితో ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరారు. వివరాలు... నిజామాబాద్‌కు చెందిన కుటుంబం జీవనోపాధి కోసం గోవాకు వెళ్లింది. 8 ఏళ్ల క్రితం అక్కడ వారి కుమారుడు తప్పిపోయాడు. రెండేళ్లు అక్కడి సదనంలో ఆశ్రయం పొందిన ఆ బాలుడిని ఆరేళ్ల క్రితం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనానికి తరలించారు. విజయవాడ సమీపంలోని యనమలకుదురుకు చెందిన మరో బాలుడు మతిస్థిమితం సరిగా లేని పరిస్థితుల్లో ఐదేళ్ల క్రితం రైలు ఎక్కి వరంగల్ చేరుకున్నాడు. అక్కడి నుంచి అతడిని కూడా సైదాబాద్‌లోని సదనానికి తరలించారు. ఇద్దరి నుంచి కొంత సమాచారం, ఆధార్ వివరాలు సేకరించిన సదనం అధికారులు ఎట్టకేలకు వారి తల్లిదండ్రుల చిరునామాలు సంపాదించారు. నిజామాబాద్‌కు చెందిన బాలుడి కుటుంబం ప్రస్తుతం ఎల్బీనగర్‌లో జీవిస్తుండగా వారికి బాలుడ్ని అప్పగించారు. విజయవాడకు చెందిన మరో బాలుడిని కూడా కన్నవారికి అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

'ఎర్లీబర్డ్'ను సద్వినియోగం చేసుకోండి

సైదాబాద్: ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్–7 డిప్యూటీ కమిషనర్ వి.నర్సింహా కోరారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. కాలనీలోని పలువురు గృహ యజమానులు క్యాంపులో పాల్గొని తమ ఆస్తిపన్ను చెల్లించారు. కార్యక్రమంలో సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గున్న మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒక్క రౌండ్ కొట్టు.. ప్రాణవాయువు పట్టు!



- దేశంలోనే మొట్టమొదటి ఆక్సిజన్ పార్కు
- నాసా గుర్తించిన ఆక్సిజన్ ఉత్పత్తి చేసే మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- 90శాతం ప్రాణవాయువు అందించే 38 రకాల మొక్కల ఎంపిక
- ఎల్బీనగర్‌లో రూపుదిద్దుకుంటున్న పార్కు



ఎల్‌బీనగర్‌లోని కామినేని ఫ్లైఓవర్ల కింద ఏర్పాటు కానున్న ఆక్సిజన్ పార్కు ఊహా చిత్రాలు

మన్సూరాబాద్: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో ఓజోన్ పొర పల్చబడుతోంది. పర్యావరణాన్ని కాపాడుకొని ఓజోన్ పొరను పరిరక్షించుకునేందుకు ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే పార్కుల ఏర్పాటు అవసరం ఎంతో ఏర్పడింది. దీనిని దృష్టిలో పెట్టుకొని దేశంలోనే మొట్టమొదటిగా ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఫ్లైఓవర్ల కింద ఆక్సిజన్ పార్కు రూపుదిద్దుకుంటోంది. పార్కు పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలోనే ఈ పార్కు అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ సంస్థ నాసా గుర్తించిన 38 రకాల ఆక్సిజన్‌ను అందించే మొక్కలను ఎంపిక చేసి పార్కులో నాటనున్నారు. పార్కు మధ్యలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఒక్క రౌండ్ వాకింగ్ చేస్తే ఆక్సిజన్ లెవల్స్ పెరుగుతాయని, ఊపిరితిత్తుల సామర్థ్యం మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

390 మీటర్ల స్థలం.. 734 మీటర్ల వాకింగ్ ట్రాక్..

కామినేని ఫ్లైఓవర్ల కింద ఇరువైపులా ఉన్న స్థలంలో ఆక్సిజన్ పార్కు ఏర్పాటవుతోంది. 390 మీటర్ల స్థలంలో 734 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఎత్తైన జాలీలను ఏర్పాటు చేసి వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు కుమ్మరి పెంకులను అందంగా తీర్చిదిద్దనున్నారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేసే 38 వివిధ రకాల 34,329 మొక్కలను ఈ పార్కులో నాటనున్నారు. పార్కులో వాకర్లు కూర్చునేందుకు ప్రత్యేకంగా సీట్లను ఏర్పాటు చేయటంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి..



దేశంలోనే మొట్టమొదటగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే మొక్కలతో అత్యున్నత పార్కుగా రూపొందిస్తున్నాం. నాసా గుర్తించిన ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే మొక్కలను నాటుతున్నాం. ఈ పార్కులో ఒక్క రౌండ్ వాకింగ్ చేస్తే ఆక్సిజన్ లెవల్స్ పెరిగే అవకాశం ఉంది. సీఎం కేసీఆర్ తలపెట్టిన హరితహారం స్ఫూర్తితో ఆక్సిజన్ పార్కు నిర్మాణం చేపట్టాం. సుమారు రూ.2 కోట్ల నిధులతో ఈ పార్కు పనులు ప్రారంభమయ్యాయి. పనులు తుది దశకు చేరాయి. త్వరలోనే పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

దాతల సహకారం అభినందనీయం



కోనేరు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, పాలక మండలి సభ్యులు

చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ కోనేరును ఆధునీకరించేందుకు ముందుకు వచ్చిన దాతల కృషి అభినందనీయమని ఆలయ పాలక మండలి చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ అన్నారు. శనివారం ఆమె ఈఓ శ్రీనివాస శర్మ, పాలక మండలి సభ్యులతో కలిసి కోనేరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ మాట్లాడుతూ... వైఆర్‌పీ ఫౌండేషన్, వైష్ణవీ గ్రూప్ చైర్మన్ ఎలిశాల రవిప్రసాద్ ఆయన సతీమణి శారద ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో ఆలయ కోనేరు ఆధునీకరణ పనులు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఆలయాభివృద్ధికి దాతల సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయని, ఆలయాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ తీర్థస్థలంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హేమచంద్ర, శరత్ చంద్ర, ఎడ్ల కృష్ణారెడ్డి, మధుసాగర్, ఆలయ పాలక మండలి సభ్యులు మెరిశెట్టి శ్రీనివాస్, రంగారెడ్డి, మల్లేష్‌గౌడ్, అఖిల సాగర్, నర్రె శ్రీనివాస్, యాదిరెడ్డి, వెంకటరెడ్డి, అనిత, అశోక్‌గౌడ్, జంగయ్య, జంగారెడ్డి, నాయకలు నల్లా రఘుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరిస్తున్నాం

మన్సూరాబాద్: సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సమావేశం శనివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి, నరసయ్య, హరినాథ్, బాలరాం, విష్ణువర్ధన్‌రాజు, భిక్షపతి, యాదగిరి, రామస్వామిగౌడ్, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, నర్సింహగౌడ్, పుణ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇస్తానని నమ్మించి..

గొలుసు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

నాగోలు: ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని నమ్మించి వారి మెడలో ఉన్న బంగారు గొలుసులు లాక్కెళుతున్న వ్యక్తిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి మూడు తులాల గొలుసు, బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. యాదాద్రి జిల్లా, గోసుకొండ గ్రామానికి చెందిన వరికుప్పల శివకృష్ణ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం వారికి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి బైక్‌పై ఎక్కించుకుంటాడు. వారిని నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బంగారు గొలుసులు లాక్కెళ్లేవాడు. ఈ క్రమంలో ఈనెల 7 న బండ రావిరాల గ్రామానికి చెందిన బాలమ్మ సద్దుపల్లి చౌరస్తా నుంచి గ్రామానికి నడిచి వెళుతుండగా వెనక నుంచి బైక్‌పై వచ్చిన శివకృష్ణ ఆమెను ఊరిలో దింపుతానని బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్ది దూరం తీసుకెళ్లిన తర్వాత బైక్‌లో సమస్య ఉందని చెప్పి ఆమెను కిందికి దింపాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న రెండు వరసల బంగారు గొలుసు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు శివకృష్ణను శనివారం అరెస్టు చేసి అడి నుంచి బంగారు అభరణాలు, బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ స్వామి, డీఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్లు పగులగొట్టేందుకు భారీ పేలుడు



పేలుడు ధాటికి పెచ్చులూడిన గోడ

- పేలుడు ధాటికి సమీపంలోని ఇళ్ల గోడలకు బీటలు
- కాలనీవాసుల ఫిర్యాదుతో కేసు నమోదు



భవనం కింద వచ్చిన పగుళ్లు

లింగోజిగూడ: భారీ స్థాయిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేలుడు పదార్థాలను వినియోగించి భూమిలోని బండరాళ్లను పేల్చింది. పేలుడు ధాటికి సమీప కాలనీల్లోని పలు ఇళ్ల గోడలు బీటలు వారడంతో పాటు రాళ్లు ఎగిరిపడి కిటికీ అద్దాలు పగిలాయి. ఎలాంటి అనుమతులు లేకుండా పేలుళ్లకు పాల్పడిన నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సమీప కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఓ నిర్మాణ సంస్థ భారీ స్థాయిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టింది. అయితే, భూమిలో నిర్మాణానికి అడ్డుగా ఉన్న బండరాళ్లను శుక్రవారం రాత్రి 10.30 కి పేలుడు పదార్థాలను ఉపయోగించి పేల్చారు. పేలుడు ధాటికి భూమి కంపించడంతో పాటు భారీ శబ్దం రావడంతో సమీపంలోని కృష్ణానగర్, జనప్రియ కాలనీ వాసులు ఉలిక్కిపడ్డారు. భయంతో ఇళ్ల నుంచి భయటకు పరుగు తీశారు. పేలుగు ధాటికి ఇంటి గోడలకు పగుళ్లు రావడంతో పాటు కిటికీలు ధ్వంసమయ్యాయని వారు వాపోతున్నారు. సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని శనివారం కృష్ణానగర్ కాలనీవాసులు ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘనటకు సంబంధించి ఇప్పటికే ఇద్దరిని అదుపులో తీసుకోని ప్రశ్నిస్తున్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న మోదీ: సీపీఐ

సైదాబాద్: ప్రధాని మోదీ రాక సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్‌ను సైదాబాద్ పోలీసులు శుక్రవారం రాత్రి ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం శనివారం మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా షేక్ మహమూద్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు పంచిపెడుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలు ఇష్టానుసారంగా పెంచిన కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని ప్రజలందరూ ప్రశ్నించాలని, దేశాన్ని ప్రజా వ్యతిరేక పాలన నుంచి కాపాడుకోవాలని ఆయన అన్నారు.

'విద్యార్థుల పక్షాన పోరాటం ఆపేది లేదు'


మన్సూరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌టీపీ చేపట్టిన పోరాటాన్ని ఆపేది లేదని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మామిడి రాంచందర్ అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ కోసం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో శనివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, పరీక్ష పత్రాల లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని కొన్ని నెలలుగా వైఎస్సార్‌టీపీ డిమాండ్ చేసిందని, తీరా నోటిఫికేషన్లు వేసిన ప్రభుత్వం పరీక్ష పత్రాలను లీకేజీ చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పల్లె అజయ్‌కుమార్, ఎస్కే మాసుమ్, కోట్ల వాసుదేవ్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, కోమల, రమావత్ రవి, చంద్రశేఖర్, సత్తిరెడ్డి, కృష్ణానాయక్, జనార్దన్, సాంబయ్య, రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

హస్తినాపురం: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు చేస్తోందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని మసీద్‌లో ఆమె ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సయ్యద్ పాషా, డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇబ్రహీం, జహంగీర్, రహీం, మజీద్ కమిటీ అధ్యక్షుడు హకీం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శశి పాల్గొన్నారు.

వందే భారత్ రైలు వైపు వెళ్లొద్దు!

గేదెలకు టీఎస్ రెడ్కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి విజ్ఞప్తి



వందే భారత్ రైలు వైపు వెళ్లొద్దు అంటూ గేదెలకు విజ్ఞప్తి చేస్తున్న సతీష్‌రెడ్డి

నాగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనతో పాటు వందే భారత్ రైలు ప్రారంభోత్సవంపై టీఎస్ రెడ్కో చైర్మన్ వై. సతీష్ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. వందే భారత్ రైలు ప్రారంభమయ్యాక ఇప్పటివరకు దాదాపు 68 ప్రమాదాలు జరిగాయని, గేదెలు, ఆవులను ఢీకొని వందే భారత్ రైళ్లు దెబ్బతిన్నాయని సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం నాగోలులో ఆయన మాట్లాడుతూ, మోదీ సికింద్రాబాద్ – తిరుపతి వందే భారత్ రైలును ప్రారంభిస్తున్నారని, దయచేసి అటువైపు వెళ్లొద్దు.. మీరు పొరపాటున తాకినా రైలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అసలే ఆ రైళ్లు చాలా వీక్ గా ఉంటాయి'' అని గేదెలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకే వందే భారత్ స్కీంను ప్రధానమంత్రి మోదీ ఎన్నిసార్లు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు



జరీనా కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి వల్ల పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీకి చెందిన జరీనా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఆపరేషన్ చేయించేందుకు అవసరమైన డబ్బు కోసం కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. రూ.2.50 లక్షలను మంజూరు చేస్తూ సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్‌ఓసీ వచ్చింది. దానిని లబ్ధిదారు జరీనా కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, జంగీర్ బాబు గౌడ్, అంజనేయులు, గవ్వ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యేసుక్రీస్తు ప్రేమ, దయాగుణాలను చాటాలి



దిల్‌సుఖ్‌నగర్‌లో రన్‌ఫర్ జీసెస్‌ను ప్రారంభిస్తున్న బిషప్ తిమోతి, పాస్టర్లు

మలక్‌పేట: యేసుక్రీస్తు మానవవళి కోసం సిలువను మోస్తూ సర్వలోకానికి ప్రేమను చాటిచెప్పారని ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ చైర్మన్, నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు బిషప్ తిమోతి కొల్లబత్తుల అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి నుంచి శనివారం చేపట్టిన రన్ ఫర్ జీసెస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమోతి మాట్లాడుతూ, క్రైస్తవ సమాజం ఐక్యత కలిగి.. ఇతరుల పట్ల యేసుక్రీస్తు చూపిన దయ, ప్రేమ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. ర్యాలీ దిల్‌సుఖ్‌నగర్ నుంచి మూసారంబాగ్ చౌరస్తా, మలక్‌పేట డీ మార్ట్, అక్బర్‌బాగ్ చౌరస్తా, అస్మాన్‌ఘడ్, గడ్డిఅన్నారం, శంకేశ్వర్‌బజార్, సైదాబాద్, సౌత్‌ఈస్ట్ డీసీపీ ఆఫీస్, చంచల్‌గూడ పెట్రోల్ పంపు, గవర్నమెంట్ ప్రెస్ మీదుగా నల్లగొండ క్రాస్‌రోడ్ ఎంబీ చర్చి వరకు కొనసాగింది. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాల్మన్‌రాజ్, కోశాధికారి శ్యామ్, పాస్టర్ రెవరెండ్ మెన్నోజోయల్, ఇజ్రాయల్, జయరాజ్ బెంజిమిన్, అబ్రహం, మనోహర్, రమేష్, నవీన్, పాల్గొన్నారు

టాలెంట్ సెర్చ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విశాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ రవీంద్ర భారతి స్కూల్లో శనివారం సామాజిక సేవా సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ వారు 38వ సర్ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో 7వ తరగతి విద్యార్థి బి.విశాల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం, 10వ తరగతి విద్యార్థి డీఎస్ విశాల్‌కుమార్ ద్వితీయ స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, అకాడమిక్ ఇన్‌చార్జి సంధ్య ప్రతిభ కనబరిచి విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ దయాకర్, ఏడీఐ నిషాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో స్నాతకోత్సవ కార్యక్రమం సందడిగా జరిగింది. 5వ తరగతి ఉత్తీర్ణులై 6వ తరగతిలోకి వెళ్తున్న విద్యార్థులకు పాఠశాల చైర్మన్ డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. నల్లగౌను, తలపై టోపీ ధరించి పట్టాలు అందుకున్న విద్యార్థులు.. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మాధవి, యోగా గురువు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న లోటస్‌ల్యాప్ విద్యార్థులు

మోదీ సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



చంపాపేట నుంచి ర్యాలీగా వెళుతున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి



బీఎన్‌రెడ్డినగర్ నుంచి బస్సులో వెళ్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల నుంచి భారీ స్థాయిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలోను, మన్సూరాబాద్ నుంచి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ నుంచి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, చంపాపేట నుంచి కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సికింద్రాబాద్‌కు తరలివెళ్లాయి. గడ్డిఅన్నారం నుంచి కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాగోలు నుంచి కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్, మూసారంబాగ్ నుంచి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు వెళ్లారు.



వేదిక వద్ద మోదీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ భాగ్యనగర్‌జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి



ప్రధాని మోదీని కలుసుకున్న మలక్‌పేట బీజేపీ కన్వీనర్ నవీన్‌రెడ్డి